క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి, మంగళగిరిలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి అభివృద్ధిలో భాగంగా మంగళగిరి మండలం కాజా, టోల్‌ప్లాజా నుంచి కృష్ణా జిల్లా గొల్లపూడి వరకు నిర్మితమవుతున్న ఔటర్ రింగ్ రోడ్‌లో భాగంగా, నవులూరు వద్ద నిర్మితమవుతున్న ఫ్లై ఓవర్‌కు అవరోధంగా ఉన్న 132 కేవీ విద్యుత్ లైన్ మార్పు, నూతన విద్యుత్ టవర్ల నిర్మాణం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అనివార్య పరిస్థితుల్లో మాత్రమే విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ



మంగళగిరి: విద్యార్థుల్లో వస్తున్న మానసిక సమస్యలను పరిష్కరంచేలా ఉపాధ్యాయులు ధ్రుడంగా ఉండేందుకు స్టెప్ (ఎస్‌టీఈపీ) ఆధ్వర్యంలో ఉచిత కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకులు ప్రత్యూష సుబ్బారావు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం పలు ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ నెల 10 నుంచి 19 వ తేదీ వరకు తుళ్ళూరు మండలం నెక్కల్లు గ్రామంలో శిక్షణ జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలలో స్టెప్ ప్రిన్సిపల్ బీబీ కృష్ణయ్య, రాష్ట్ర నాయకులు ఎం.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయం అసిస్టెంట్ పూజారి మృతి



తాడేపల్లిరూరల్ : మంగళగిరి కొత్తపేటలోని శ్రీ గంగ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో అసిస్టెంట్ పూజారిగా పనిచేస్తున్న బూర్గుల శంకర శాస్త్రి సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివాలయంలో సుమారు 45 సంవత్సరాల నుంచి అసిస్టెంట్ పూజారిగా విధులు నిర్వహిస్తున్నారు. శంకర శాస్త్రి భౌతిక కాయాన్ని పలువురు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం

ఫిరంగిపురం: సీజనల్‌గా వచ్చే డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ శాంతి అన్నారు. మండలంలోని శిరంగిపాలెంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 178 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. డయేరియా నివారణకు జాగ్రత్తలను డాక్టర్ శాంతి వివరించారు. విరోచనాలు ఎక్కువగా అవుతున్నట్లయితే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని వివరించారు. సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరీ, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఏఎన్‌ఎం ఆనందకుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగలు బాబోయ్ దొంగలు

మంగళగిరి: గత పది రోజుల్లో మూడు చైన్ స్నాచింగ్‌లు, ఇళ్ళల్లో దొంగతనాలు మంగళగిరిలో సంచలనం రేకెత్తించాయి. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసుకుని..దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఈ దొంగతనాల్లో సుమారు రూ.30 లక్షలకు విలువైన బంగారం, వెండి, నగదు చోరీకి గురైంది. ఉదయం ఇళ్ల ముంగిట పనులు చేసుకునే మహిళలు, వృద్ధులే లక్ష్యంగా మెడలోని బంగారం గొలుసులు యథేచ్ఛగా లాక్కెళ్లి పోతున్నారు. జల్సాలకు, వ్యసనాలకు అలవాటు పడ్డ యువకులు రోజుకో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నారు. వారానికో చోరీ అన్న మాట మంగళగిరిలో సాధారణమైంది. అధికారుల బదిలీలతో నిఘా కొరవడి.. నిద్రావస్థలో ఉంది. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి వెంటనే నిఘా పెంచి.. చోరీలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

దొరికిన పర్స్ పోలీస్‌స్టేషన్‌లో అందజేత

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని కాజ గ్రామంలో నేషనల్ హైవే టోల్ గేట్ వద్ద తనకు దొరికిన పర్సును కాజ గ్రామ సర్వేయర్ స్టాలిన్ మంగళగిరి రూరల్ పోలీసులకు సోమవారం అందజేశారు. ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్టాలిన్ అందజేసిన పర్స్ విజయవాడ కేఎల్‌రావ్ నగర్‌కు చెందిన ఎస్కే సమద్‌గా గుర్తించామని తెలిపారు. అందులో పాన్, బ్యాంక్ ఎటీఎం, ఆధార్ కార్డులు ఉన్నాయని తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వస్తే అందజేస్తామన్నారు. సర్వేయర్ స్టానిల్‌ను అభినందించారు.

చెరువును తలపిస్తున్న సర్వీస్ రోడ్లు

- వాహనదారులు, పాదచారుల ఇక్కట్లు
- పట్టించుకోని జాతీయ రహదారి సిబ్బంది

తాడేపల్లిరూరల్ : స్థానిక 16వ నంబరు జాతీయ రహదారి వెంబడి ఉన్న సర్వీస్ రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. వర్షపు నీరు నిలబడడంతో వాహనదారులకు, పాదచారులకు ఇక్కట్లు తప్పడం లేదు. సోమవారం కురిసిన వర్షానికి మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కనకదుర్గ వారధి వద్ద గుంటూరు వెళ్లే రహదారిలో జాతీయ రహదారి వెంబడి ఉన్న సర్వీస్ రోడ్డులో మోకాళ్ల లోతు నీళ్లు నిలబడ్డాయి. అక్కడ కారులో ప్రయాణించేవారు కూడా లోపలకు నీళ్లు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. పాదచారుల ఇక్కట్లయితే చెప్పనవసరం లేదు. తాడేపల్లి నగరంలోకి ప్రవేశించే అండర్ పాస్ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్స్ నుంచి వర్షపునీరు భారీగా వచ్చి అండర్ పాస్‌కు చేరుతున్నాయి. వర్షం తగ్గిన రెండు మూడు గంటల వరకు నీరు నిలబడడంతో జాతీయ రహదారిని అండర్ పాస్ నుంచి దాటుకుంటూ వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. కొలనుకొండ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఎన్నిసార్లు జాతీయ రహదారి సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ పలువురు విమర్శిస్తున్నారు. వర్షం పడితే సర్వీస్ రోడ్డు వెంబడి ఉన్న దుకాణ యజమానుల ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. వాహనాలు వచ్చి వెళ్లే సమయంలో ఆ నీళ్లు ఏకంగా దుకాణాల్లోకి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వీస్ రోడ్డులో పలుచోట్ల ఆక్రమణలు జరగడం వల్లే ఇలాంటి ఇబ్బందులు పడుతున్నామని పలువురు ప్రయాణికులు వ్యాఖ్యానిస్తున్నారు.



సర్వీస్ రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

తల్లికి వందనం పథకం

అమలులో కూటమి ప్రభుత్వం దగా

మాజీ హోంమంత్రి మేకతోటి సుచరిత



తాడికొండ: తల్లికి వందనం పథకం అమలులో టీడీపీ కూటమి ప్రభుత్వం లబ్ధిదారులను దగా చేస్తోందని మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత విమర్శించారు. తల్లికి వందనం, మాజీ ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులపై ఆమె సోమవారం స్పందించారు. నాడు సూపర్ సిక్స్‌గా చెప్పుకున్న తల్లికి వందనం పథకాన్ని ఇప్పుడు ప్రస్తావించకపోవడం బాబు మాట తప్పాడు అనేందుకు నిదర్శనమన్నారు. తల్లికి వందనం అమలుపై ఇటీవల జీఓ నంబరు 29 జారీ చేసిన ప్రభుత్వం.. ప్రతి తల్లికి రూ.15 వేలు ఇస్తామంటూ ప్రకటించిందని, అసలు పథకం ఎలా అమలు చేయాలనుకుంటున్నారో సమాధానం చెప్పాలన్నారు. దీనిపై వైఎస్సార్ సీపీ ఎన్నిసార్లు ప్రశ్నించినా ప్రభుత్వ నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పథకంలో అర్హులైన కొత్త పిల్లలను చేర్చాలని, పథకాన్ని పక్కాగా అమలు చేయాలని కోరారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో ఉండి ఉంటే ఇప్పటికే అమ్మ ఒడి వచ్చి ఉండేది కాదా..? అని ప్రశ్నించారు.

వైఎస్ జగన్‌పై అక్రమ కేసు

అప్పటి ఎంపీగా ఉన్న రఘురామ కృష్ణంరాజు ఫిర్యాదులో వాస్తవం లేదని సాక్ష్యాత్తు సుప్రీం కోర్టు తప్పు పట్టి, అప్పుడే కొట్టి వేసినా మళ్లీ ఈ ప్రభుత్వం నిస్సిగ్గుగా మూడేళ్ల తర్వాత సీనియర్ ఐపీఎస్‌లతో పాటు వైఎస్ జగన్, డాక్టర్‌పైనా కేసు నమోదు చేయడంలో ఆంతర్యం ఏమిటని మేకతోటి సుచరిత ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలీసులు ఓ కొత్త సంప్రదాయానికి తెరతీశారని, ఇది ఏ మాత్రం సమంజసం కాదన్నారు. భవిష్యత్తులో అది వారికే ఇబ్బందిగా మారుతుందని స్పష్టం చేశారు. 77 రోజుల తరువాత సాక్షులను విచారించడమే సరికాదని సుప్రీం తేల్చి చెప్పిందని గుర్తు చేశారు. అలాంటప్పుడు మూడేళ్ల తర్వాత విచారిస్తే ఏం జరుగుతుందని ప్రశ్నించారు. ఈ కేసులో రఘురామ ఫిర్యాదు మీద న్యాయ సలహా తీసుకున్నామని పోలీసులు చెబుతుండటం మరో ట్విస్ట్ అన్నారు.

కౌలు రైతుల సంతకాల సేకరణ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెరికలపూడి, పెదపాలెం, పెదకొండూరు, గొడవర్రు, చిలువూరు గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కరపత్రాలు పంపిణీ చేస్తూ, రైతుల వద్ద నుండి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కౌలు రైతులకు భూ యజమాని అంగీకారంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2019లో అధికారంలో వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2011 భూ ఆధీకృత కౌలు రైతు చట్టంలో మార్పు చేసి భూ యజమాని అనుమతి తప్పని సరి చేయడంతో అనేక మంది కౌలు రైతులు కౌలు కార్డులు రాక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసి, అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు మంజూరు చేసి కౌలు రైతులకు ఆదుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి వినతిపత్రం అందించేందుకు రైతుల సంతకాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రబాబు, కె.శ్రీనివాసరావు, డి.విజయలక్ష్మి, చంద్రశేఖర్, ఎం.రామ్‌చరణ్, ఎం.అంజయ్య, కె.దావీదు, శ్రీరామారావు పాల్గొన్నారు.



కౌలు రైతుల నుంచి సంతకాలు సేకరిస్తున్న సంఘం నాయకులు

సర్పంచ్‌గా బెజ్జం మహేష్ సేవలు చిరస్మరణీయం

ఇన్‌కంటాక్స్ విశ్రాంత కమిషనర్ మేకతోటి దయాసాగర్



కంతేరు(తాడికొండ): సర్పంచ్‌గా కంతేరు గ్రామ ముఖ చిత్రాన్ని మార్చి, తనదైన శైలిలో గ్రామాభివృద్ధికి బాటలు వేసిన బెజ్జం మహేష్ సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ నాయకులు, ఇన్‌కంటాక్స్ విశ్రాంత కమిషనర్ మేకతోటి దయాసాగర్ అన్నారు. కంతేరు గ్రామ సర్పంచ్ బెజ్జం మహేష్ సంస్మరణ సభలో భాగంగా చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ కంచుకోటగా ఉన్న కంతేరు గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడంతో పాటు గత 50 సంవత్సరాల్లో ఎన్నడూ లేని అభివృద్ధిని చేసి చూపించిన మహేష్ మరణం కుటుంబానికి, వైఎస్సార్ సీపీకి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉచిత ఇసుక వరం

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానం ఒక వరమని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ నాయకుడు తిరుమలశెట్టి కొండలరావు అన్నారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని తన కార్యాలయంలో ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, కార్మికులకు వస్త్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఇసుకను ఉచితంగా అందించే విధానాన్ని అమలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక కొరత వల్ల పనులు లేక కార్మికులు వలస వెళ్లిపోయారని విమర్శించారు. ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ దుగ్గిరాల మండల మాజీ అధ్యక్షుడు గూడూరు వెంకటరావు, నాయకులు రమేష్, నాగరాజు, బాషా, టైలర్ బాష, ఫిరోజ్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేస్తున్న జనసేన నాయకులు

ఆత్మకూరులో సమస్యలు పరిష్కరించండి

ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్‌కు వినతి

తాడేపల్లిరూరల్ : స్థానిక ఆత్మకూరు గ్రామంలో నివసిస్తున్న ప్రజలకు, వాహనదారుల సౌకర్యార్థం రోడ్డు నిర్మించాలని సోమవారం సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ తాతా శ్రీనివాసరావు ఇంటి నుంచి దళితవాడ ఆర్‌సీఎం చర్చి వరకు ఉన్న రహదారి గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బురదమయమైందని వివరించారు. గుంతల మయమైన రోడ్డులో వర్షపు నీరు నిలబడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గ్రామ సచివాలయం వద్ద తాగునీటి కొళాయి డ్రైయిన్ బ్లాక్ అయిందని వివరించారు. ప్రజలు అక్కడే మంచి నీరు తీసుకువెళ్లడం జరుగుతోందని, వీటిపై దృష్టిసారించి సమస్యలను పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్‌కు విన్నవించినట్లు తెలిపారు. స్పందించిన అడిషనల్ కమిషనర్ మురుగు నీరు నిల్వలేకుండా పారుదల అయ్యేందుకు చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా రహదారిని పరిశీలించి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి జాన్‌బాబు,మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సత్యానందం, మరియదాసు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



అడిషనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

రోడ్డు ప్రమాదంలో పౌల్ట్రీ కార్మికుడి మృతి

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో పౌల్ట్రీ కార్మికుడు మృతి చెందిన ఘటన తెనాలిలో సోమ వారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేర కు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం గోవాడకు చెందిన నల్లమోతు రమణయ్య (32) తెనాలి చెంచుపేటలోని పౌల్ట్రీ లో పని చేస్తున్నాడు. ప్రతిరోజు బైక్‌పై తెనాలి వచ్చి వెళుతుంటాడు. ఈక్రమంలో మధ్యా హ్నం చెంచుపేట వెళుతుండగా ఓవర్ బ్రిడ్జి డౌన్‌లో ఎదురుగా వచ్చిన సరుకు రవాణా వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతదేహాన్ని తెనాలి త్రీ టౌన్ పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినులకు ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని వీవర్స్ కాలనీలో ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 100 మంది విద్యార్థినులకు సోమవారం మంగళగిరి రోటరీ క్లబ్ శక్తి ప్రాజెక్ట్ పేరిట ఉచిత సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్‌ను అందించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ ఇంటర్నేషనల్ 3,150 డిస్ట్రిక్ గవర్నర్ కె.శరత్‌చౌదరి విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ టి.మహతి మాట్లాడుతూ సర్వైకల్ కాన్సర్స్ మహిళల్లో సంభవించే ప్రాణాంతక వ్యాధి అని, 9 నుంచి 14 సంవత్సరాల బాలికలకు వ్యాక్సినేషన్ చేయడం ద్వారా భవిష్యత్తులో ఈ క్యాన్సర్ బారిన పడకుండా సులభంగా కాపాడుకోవచ్చన్నారు. రోటరీ గవర్నర్ శరత్ చౌదరి మాట్లాడుతూ మంగళగిరి రోటరీ క్లబ్ పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఈ ఉచిత సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్‌ను విద్యార్థినులు వినియోగించుకోవాలన్నారు. గాజుల శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ సేవా కార్యక్రమాన్ని రోటరీ క్లబ్, రోటరీ కరవాలంబనం ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో తొలిసారిగా పైలెట్ ప్రాజెక్ట్‌గా శక్తి పేరిట మంగళగిరిలో చేపట్టడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని భవిష్యత్తులో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీజీ అన్నె రత్నప్రభాకర్, అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ వంశీకృష్ణ, ఎంఈఓ-2 బాబు, హైస్కూల ప్రధానోపాధ్యాయులు ఎస్. శ్రీనివాసరావు, ఇందిరానగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష, క్యాన్సర్ అవేర్‌నెస్ సోషల్ అంబాసిడర్ రూపరాజు, ఎంఆర్కే ట్రస్ట్ చైర్మన్ అనిల్ చక్రవర్తి, రోటరీ క్లబ్ కార్యదర్శి అందె మురళీమోహన్, కోశాధికారి వడ్లమూడి శ్రీనివాసరావు, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కాపరౌతు సుందరయ్య, పలువురు రొటేరియన్లు పాల్గొన్నారు.



విద్యార్థినికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

మంగళగిరి రోటరీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

తాడేపల్లిరూరల్: మంగళగిరి రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం మంగళగిరి రూరల్ పరిధిలోని చినకాకానిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి విచ్చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి 2024–2025 సంవత్సరానికి ప్రెసిడెంట్‌గా గాజుల శ్రీనివాసరావు, సెక్రటరీగా అందె మురళీమోహన్, పీడీజీగా అన్నె రత్న ప్రభాకర్, ట్రెజరర్‌గా వడ్లమూడి శ్రీనివాసరావుతో పాటు మరో 21 మంది డైరెక్టర్లతో డిప్యూటీ గవర్నర్ పాటిబండ్ల శివరంజని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఇండక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రెసిడెంట్ రావూరి రమేష్ బాబు, బ్యాంక్ ఆఫ్ అమెరికా సోషల్ అంబాసిడర్ రూపరాజు చింతలపాటి, మంగళగిరి రోటరీ క్లబ్ ట్రైనర్ ఇసునూరు అనిల్ చక్రవర్తి సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కాపరౌతు సుందరయ్య, పూర్వ ప్రెసిడెంట్లు అందె రేవంత్, త్రిపురమల్లు సతీష్‌బాబు పాల్గొని, నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

వినికిడి యంత్రాలు పంపిణీ

తెనాలిఅర్బన్: ఆశాజ్యోతి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బాలాజీ రావుపేటలోని భవిత కేంద్రంలో వినికిడి లోపంతో బాధపడుతున్న ఆరుగురు పేద విద్యార్థులకు సోమవారం హియరింగ్ మిషన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, జయంతి బాబులు మాట్లాడుతూ ఒక్కో వినికిడి యంత్రం రూ.19,500 అవుతుందని, వాటిని ఆశాజ్యోతి ఫౌండేషన్ నిర్వాహకులు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. అనంతరం పండ్లు, స్వీట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు తారా కుమార్, శశాంక్, ఆడియాలిజిస్ట్ త్రివిక్రమ్, హెచ్‌ఎం నందకుమార్, సీఆర్పీ శ్యామ్, టీచర్లు వై.రజనీకుమారి, డి. సునీత పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం

లాం(తాడికొండ): పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం తప్పనిసరి అని లాం గ్రామ సర్పంచ్ షేక్ అబీదా అలీ అన్నారు. పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా స్థానిక ముస్లిం కాలనీలో మొక్కల పెంపకం చేపట్టిన ఆమె.. మామిడి మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యతను స్థానికులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈపూరి శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు షేక్ సుభానీ, అలీ, అఫ్జల్, యాసిన్, కరిముల్లా, వెంకట్, ఉప సర్పంచ్ టి.శేషయ్య, బాబు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

రాయపూడి శ్రీమహాలక్ష్మి

కేఏఈఎస్ విద్యార్థినులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఈఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న మెరిట్ విద్యార్థినులకు సోమవారం ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రగతి స్కాలర్‌షిప్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కె.పద్మజావాణి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రగతి స్కాలర్‌షిప్స్‌ను రూ.50వేలు చొప్పున తొమ్మిది మంది విద్యార్థినులకు అందజేసిందని తెలిపారు. విద్యార్థినులు ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుని, టెక్నికల్ రంగంలో రాణించాలని కోరారు. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్స్ అందుకున్న వారిని యాజమాన్యం, సిబ్బంది అభినందించారు.



స్కాలర్‌షిప్స్ అందుకున్న విద్యార్థినులతో కళాశాల యాజమాన్యం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని బ్రహ్మానందపురం కేసీ వర్క్స్ హైస్కూల్ నందు 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ ప్రధానోపాధ్యాయులు తాడిబోయిన నాగేశ్వరరావును (టీఎస్‌ఆర్ మాస్టర్)ను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 1987–1988లో కేసీవర్క్స్ హైస్కూల్ నందు 10వ తరగతి విద్యనభ్యసించిన వారు ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన సుమారు 40 సంవత్సరాల తర్వాత అందరం ఒకచోట కలుసుకోవడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. అనంతరం స్కూల్ అటెండర్ గణేష్‌ను, చిన్నతనంలో తమకు ఐస్‌క్రీమ్‌లు అమ్మిన తాతారావు బాబాయిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో బెజ్జం రామకృష్ణారావు, షౌకత్ అలీఖాన్, పెరవలి మరియదాసు, కెలవత్ బిక్నా, సిరిపల్లి సంజీవరావు, కుంచాల శ్రీనివాసరావు, ఏనుగుల సుబ్బారావు, రామాంజనేయులు, మేకల ప్రసాద్, యాకోబు, ఎండి సాధిక్, సూర్య ప్రకాష్, కస్తూరి అరవింద్ కుమార్, అబ్బూరి శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి, బి.శంషాద్, రమాదేవి, కృష్ణవేణి, సౌభాగ్యం, రత్నప్రభ, విజయకుమారి, ధనలక్ష్మి, శివలీల, కిరణ్మయి, ఉల్దా, మరియమ్మ, ప్రేమావతి, హేమావతి పాల్గొన్నారు.

పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను కించపర్చడం తగదు



ఆర్జేడీ లింగేశ్వరరెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలల తనిఖీ సమయంలో ఉపాధ్యాయులను కించపర్చే విధంగా మాట్లాడటం తగదని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, ఎండీ ఖాలీద్ పేర్కొన్నారు. సోమవారం ఆర్జేడీ బి. లింగేశ్వరెడ్డి, డీఈవో పి.శైలజను వారి కార్యాలయాల్లో కలిసిన ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు వైఖరిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యా రంగ ప్రగతికి ఉపాధ్యాయులకు మంచి సూచనలు, సలహాలు ఇస్తే స్వాగతిస్తామని, ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అయితే దీనికి విరుద్ధంగా సంతకం పెట్ట లేదని, హెచ్‌ఎం సంతకం లేదని స్కూల్లో మెమో జారీ చేయడం సరికాదన్నారు. మహిళా ఉపాధ్యాయునులను ఇష్టారాజ్యంగా మాట్లాడటం దారుణమన్నారు. గుంటూరు రూరల్ మండలంలోని లాల్ పురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయని విభిన్న ప్రతిభావంతురాలు కాగా, ఆమెలోని లోపాన్ని కించపర్చే విధంగా మాట్లాడటం తగదన్నారు. అదే విధంగా శారదా నికేతన్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలితోనూ ఇదే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. సంబంధిత అధికారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులను కలసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు పి.లక్ష్మీనారాయణ, ఎస్.ఎస్.ఎన్.మూర్తి, జి.దాస్, జిల్లా కౌన్సిలర్లు పచ్చల శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ఎన్. శ్రీనివాసరావు ఉన్నారు.

ఉపాధ్యాయులను కించపర్చలేదు

పాఠశాలల తనిఖీ సమయంలో తాను ఉపాధ్యాయులను కించ పర్చే విధంగా వ్యవహరించలేదని గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విధి నిర్వహణలో భాగంగా పాఠశాలలో విద్యార్థుల ప్రగతిపై ఉపాధ్యాయులతో మాట్లాడటం, ప్రశ్నించడం మినహా తాను వ్యక్తిగతంగా ఎవ్వరిని దూషించలేదని, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తనపై కావాలనే ఈ విధంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.